PRGI No : TGMUL/25/A1386

తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 349 పేజీలు - 08 గురువారం 12 నవంబర్ 2026

తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నెల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

ముస్లిం రిజర్వేషన్లపై
బీజేపీ ద్వంద్వ వైఖరి

- బీజేపీ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి సూటి సవాల్ - తెలంగాణలో రిజర్వేషన్ల రద్దు మాటలు చెబుతూ గుజరాత్‌లో ఎందుకు కొనసాగిస్తున్నారు?

- కమలంతో ప్రాంతీయ పార్టీలు రాజీ.. బీజేపీతో కాంగ్రెస్‌ది నిరంతర పోరాటం ఢిల్లీలో మోడీ గల్లీలోకి వెళ్లగానే గులాబీ కాస్తా కమలంగా మారుతోంది: సీఎం ఎద్దేవా



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 11: తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ ప్రకటనలు చేస్తున్న బీజేపీ నేతలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సూటి ప్రశ్న సంధించారు. బీజేపీకి నిజంగా ధైర్యం ఉంటే ఆ పార్టీ అధికారంలో ఉన్న గుజరాత్‌లో అమలవుతున్న ముస్లిం రిజర్వేషన్లను తొలగించాలని సవాల్ విసిరారు. తెలంగాణలో ముస్లిం రిజర్వేషన్లపై మాట్లాడుతున్న బీజేపీ నేతలు గుజరాత్ విషయంలో ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీశారు. మతోన్మాద బీజేపీతో కొన్ని ప్రాంతీయ పార్టీలు రాజీపడుతున్నాయని, కాంగ్రెస్ మాత్రం ఆ పార్టీతో నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.తెలంగాణ ఉర్దూ అకాడమీ, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (టీజీఎంఆర్ఈఐఎస్) సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో మెజారిటీ, మైనారిటీ వర్గాల సంక్షేమం, భద్రత కాంగ్రెస్ ప్రభుత్వాలతోనే సాధ్యమని పేర్కొన్నారు.రాష్ట్రానికి పర్యాటకుల్లా వచ్చే బీజేపీ జాతీయ నాయకులు.. తెలంగాణలో తమ పార్టీ అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లను తొలగిస్తామని ప్రజలను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. మిగతా2లో...

జాతీయ స్థాయిలో
మెరిసిన జీహెచ్ఎంసీ

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం స్వీకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 11: స్వచ్ఛ సర్వేక్షణ్ 202526 జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) జాతీయ పురస్కారాన్ని అందుకుంది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం మిగతా2లో...


2లో

విద్యారంగానికి
ప్రభుత్వ ప్రాధాన్యం

కాజీపేటలో రూ.10 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ విద్యార్థులకు సమాన విద్యావకాశాలు: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైడ్రా కమిషనర్‌కు
హైకోర్టు ఆదేశాలు


కోర్టు ధిక్కరణ కేసులో నవంబర్ 17న హాజరుకావాలని స్పష్టం.. రంగనాథ్‌తో పాటు శంషాబాద్ తహసీల్దార్‌ను తీసుకురావాలని డీజీపీకి ఆదేశం



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 11: హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ధిక్కరణ కేసు విచారణకు వ్యక్తిగతంగా హాజరుకాకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. ఆయనను నవంబర్ 17న కోర్టు ముందు హాజరుపరచాలని రాష్ట్ర డీజీపీని ఆదేశించింది. రంగనాథ్‌తో పాటు శంషాబాద్ తహసీల్దార్ అమర్ లింగంను కూడా హాజరుపరచాలని స్పష్టం చేసింది.కోర్టు గతంలో సమన్లు జారీ చేసినప్పటికీ అధికారులు విచారణకు హాజరుకాకపోవడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. మిగతా2లో...

రేపు ఏపీ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- మూడు విడతల్లో ఎన్నికలు.. నవంబర్ 26, 29, డిసెంబర్ 2న పోలింగ్


2లో

రైతులను మోసం చేసిన
కాంగ్రెస్ ప్రభుత్వం

పంట పాలాలకు నీరు నిలిపేశారు.. ఇతర రాష్ట్రాలకు కరువు బృందాలు.. తెలంగాణకు మొండి చేయి చూపిన కేంద్రం

8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు ఉండి ఏం లాభం?

ప్రధాని మోదీ ఇంటి ఎదుట బైఠాయించి ధర్నా చేయాలి: నిర్మల్

రైతు గర్జన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 11: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే కరువు కాటకాలు వచ్చాయని, అసమర్థ పాలనతో తెలంగాణ ప్రజల సంక్షేమం ఆగమవుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు కరువు బృందాలను పంపి తెలంగాణకు పంపకుండా మొండిచేయి చూపిందని ఆరోపించారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహించిన రైతు గర్జన సభలో ఆయన ప్రసంగించారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, సంక్షేమ కార్యక్రమాలను నిలిపివేసిందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో పెట్టారని, ఆరు నెలల్లో ఉద్యోగులకు పీఆర్సీ ఇస్తామని చెప్పి అమలు చేయలేదని కేటీఆర్ అన్నారు. మిగతా2లో...

హైదరాబాద్‌కు
పూర్వ వైభవం

చెరువుల నగరంగా హైదరాబాద్ పాత గుర్తింపును పునరుద్ధరిస్తాం..

భవిష్యత్ తరాల కోసం జలవనరుల పరిరక్షణ: సీఎం రేవంత్‌రెడ్డి


2లో


2లో

సమ్మక్క బ్యారేజీకి కొత్త డీపీఆర్ రూపొందించాలి

ఆయకట్టు వివరాలు పూర్తిగా సేకరించాలని కేంద్ర జలసంఘం సూచన

అధికారులకు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశం

ఈ నెల 14న గిగ్
కార్మికుల భారీ ర్యాలీ

- **హైదరాబాద్‌లో శిల్పకళా వేదిక నుంచి హెచ్ఐసీసీ వరకు ప్రదర్శన.. పాల్గొననున్న రాహుల్‌గాంధీ**


2లో

ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ ద్వంద్వ వైఖరి

(మొదటి పేజీ తరువాయి)

అలాంటి ప్రకటనలు చేసే నేతలు ముందుగా గుజరాత్‌లో ముస్లింలకు అమలవుతున్న రిజర్వేషన్లపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేదలకు ఓటు హక్కు కల్పించడాన్ని రాజ్యాంగ రచన సమయంలోనే కొందరు వ్యతిరేకించారని, అయితే కాంగ్రెస్ అందరికీ ఓటు హక్కు కల్పించిందని గుర్తుచేశారు.**బీఆర్ఎస్ మాట తప్పింది** తెలంగాణలో ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ఆ హామీని నెరవేర్చకుండా మోసం చేసిందని సీఎం విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకమని చెప్పుకునే బీఆర్ఎస్.. ఢిల్లీకి వెళ్లగానే బీజేపీతో సఖ్యతగా వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో గులాబీ పార్టీగా కనిపించే బీఆర్ఎస్.. ఢిల్లీలో మోడీ గల్లీలోకి వెళ్లగానే కమలంలా మారిపోతోందని వ్యాఖ్యానించారు. పాతబస్తీకి మెట్రో రైలు విస్తరణ విషయంలోనూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.**మైనారిటీ విద్యార్థుల ఉపకార వేతనాలు నిలిపివేత** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మైనారిటీ విద్యార్థులకు అందించే ఉపకార వేతనాలను నిలిపివేయడంపై రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతబస్తీ విద్యార్థులు, మైనారిటీ పిల్లలు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. ఏ మతంలో పుట్టాలనేది ఎవరి చేతుల్లో ఉండదని, మతం ఆధారంగా వివక్ష చూపడం హేయమైన చర్య అని అన్నారు. దేశ జనాభాలో మైనారిటీలు సుమారు 15 శాతం ఉన్నారని, వారి అభివృద్ధిని విస్మరిస్తే దేశం సమగ్ర అభివృద్ధి సాధించలేదని పేర్కొన్నారు.మక్కాకు వెళ్లే యాత్రికులపై కేంద్రం అదనంగా రూ. 10 వేలు చెల్లించేలా ఆదేశాలు తీసుకొచ్చినప్పుడు పేద ముస్లింలపై భారం పడకుండా ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని తెలిపారు. అన్ని మతాల ప్రజలను కాంగ్రెస్ సమానంగా చూస్తుందని, మైనారిటీల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

మూడేళ్ల పాలనలో ఎవరికి న్యాయం చేశారో ప్రజలు గమనించాలని సూచించారు. బీడీ పరిశ్రమపై జీఎస్టీ విధించిన సమయంలో ఆ పరిశ్రమకు అండగా నిలిచిన నాయకుడు కేసీఆర్ అని గుర్తుచేశారు. నిర్మల్ జిల్లాలోనే 63 వేల మంది బీడీ కార్మికులకు పెన్షన్లు అందించినట్లు తెలిపారు.**రైతు హామీలను నెరవేర్చలేదు** రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, మూడేళ్లు గడిచినా వాటిని నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. వరి పంటకు మద్దతు ధరతో పాటు రూ. 500 అదనపు బోనస్ ఇస్తామని చెప్పి ఏ ఒక్క పంటకూ ఇవ్వలేదన్నారు. మూడు విడతలుగా రైతుబంధు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. రైతులకు సాగునీరు, విద్యుత్ నిలిపివేశారని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందడం లేదని విమర్శించారు. యాసంగి పంటకు దుక్కి దున్నొద్దని, విత్తనం చల్లొద్దని చెబుతూ ప్రభుత్వం రైతులతో స్వీయ ప్రకటనలు రాయిస్తోందని అన్నారు.**కేంద్రంపై ఒత్తిడి తేవాలి**నిర్మల్ జిల్లాలో తొమ్మిది మండలాలను కరువు మండలాలుగా ఎలా ప్రకటించారని కేటీఆర్ ప్రశ్నించారు. గోదావరి నది ఒడ్డున, ఎస్ఆర్ఎస్పీ వంటి ప్రాజెక్టులు ఉన్న జిల్లాలో కరువు పరిస్థితులు రావడంపై ప్రభుత్వాన్ని నిలదీశారు. కడెం ప్రాజెక్టు కింద సాగునీరు నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఒక్క పైసా కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇతర రాష్ట్రాలకు కరువు బృందాలు వెళ్లి తెలంగాణకు రాకపోతే రాష్ట్రంలోని ఎనిమిది మంది బీజేపీ ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రానికి న్యాయం జరిగేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, అవసరమైతే ప్రధాని మోదీ ఇంటి ఎదుట బైఠాయించి ధర్నా చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, నాయకులు జాన్సన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వ ప్రాధాన్యం

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 11: తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించి, ప్రపంచ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్ద డమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కాజీపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విద్య ద్వారానే సమాజ సమగ్ర అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల విద్యార్థులందరికీ సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు అనుమతులు ఇచ్చామని, ఒక్కో పాఠశాలను 20 నుంచి 25 ఎకరాల్లో సుమారు రూ.200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ పాఠశాలల్లో ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్య, ఆధునిక సదుపాయాలు, విద్యార్థులు, సిబ్బందికి వసతి కల్పిస్తామని వివరించారు. అన్ని సామాజిక వర్గాల పిల్లలు ఒకే ప్రాంగణంలో చదువుకోవడం ద్వారా సమానత్వం, సామాజిక సమైక్యత పెంపొందుతాయని చెప్పారు.ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు డిజిటల్ బోధన, ఆధునిక తరగతి గదులు, శిక్షణ పొందిన ఉపాధ్యా యులు, రవాణా సదుపాయాలు కల్పిస్తామన్నారు. విద్యార్థులకు యూనిఫామ్‌లు, పుస్తకాలు, బ్యాగులు, బూట్లు ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని సుమారు 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకం అమలు చేస్తున్నామని భట్టి తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కేంద్రీకృత వంటశాలల ద్వారా పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కుడా చైర్మన్ గుండు సుధారాణి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, పోలీస్ కమిషనర్ శ్వేత తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు పూర్వ వైభవం

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 11: హైదరాబాద్ నగరానికి చెరువుల నగరంగా ఉన్న పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావడమే తన సంకల్పమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. నగరంలోని చెరువులను పునరుద్ధరించి భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మాదాపూర్‌లో పునరుద్ధరించిన తమ్మిడికుంట చెరువును బుధవారం ప్రారంభించనున్న సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.తమ్మిడికుంట చెరువును సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. గతంలో ఆక్రమణలు, ఇతర కారణాలతో చెరువు విస్తీర్ణం తగ్గిపోయిందని, హైడ్రా ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించి పూడికను తీసి పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. చెరువు పరిసరాల్లో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల ఆట స్థలం, పచ్చదనం వంటి సదుపాయాలను ఏర్పాటు చేశారు. **ఇప్పటికే మూడు చెరువుల పునరుద్ధరణ**హైదరాబాద్‌లో ఇప్పటికే నల్లచెరువు, బతుకమ్మకుంట, బం-రుక్నుద్దౌలా చెరువులను పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సీఎం తెలిపారు. తమ్మిడికుంట నాలుగో చెరువుగా అందుబాటులోకి రానుంది. మరికొన్ని చెరువుల పనులు పూర్తయిన వెంటనే వాటిని కూడా ప్రజలకు అంకితం చేస్తామని చెప్పారు.నగరంలో గతంలో 1,372 చెరువులు ఉండగా, దాదాపు సగం చెరువులు కనుమరుగయ్యాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. చెరువుల ఆక్రమణల వల్ల వర్షాకాలంలో కాలనీలు, రహదారులు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. జలవనరులను కాపాడితేనే నగరాన్ని వరదల నుంచి రక్షించగలమని స్పష్టం చేశారు.

నాగార్జునకు సీఎం అభినందనలు

తమ్మిడికుంట అభివృద్ధికి సినీనటుడు అక్కినేని నాగార్జున స్వచ్ఛందంగా రెండు ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించడంపై సీఎం అభినందనలు తెలిపారు. చెరువుల పరిరక్షణకు ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. మూసీ నది పునరుజ్జీవన పనులను కూడా త్వరలో ప్రారంభిస్తామని, ఈ ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడంతోపాటు చెరువుల ఆధారంగా ఆర్థిక, పర్యాటక కార్యకలాపాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ఎరువుల రాయితీకి రూ.62,370 కోట్లు

- రబీ సీజన్ 202627కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం..
- గత సీజన్‌తో పోలిస్తే 64 శాతం పెంపు

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 11: రబీ సీజన్ 202627కు సంబంధించి ఫాస్ఫేటిక్, పొటాషిక్ (పీ అండ్ కే) ఎరువులపై రూ.62,370.02 కోట్ల రాయితీకి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. గత రబీ సీజన్‌లో ఈ రాయితీ కోసం రూ.37,952.29 కోట్లు కేటాయించగా, ఈసారి అదనంగా రూ.24,417.73 కోట్లు పెంచారు. అంటే గత ఏడాదితో పోలిస్తే సుమారు 64 శాతం పెంపు జరిగింది.అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువులు, ముడిసరుకుల ధరల్లో వచ్చిన మార్పుల నేపథ్యంలో రైతులకు అందుబాటు ధరల్లో ఎరువులు సరఫరా చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం వెల్లడించింది. డీఏపీ, ఎన్‌పీకేఎస్ తదితర రకాల ఎరువులకు ఈ రాయితీ వర్తించనుంది. 2026 అక్టోబర్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు ఆమోదించిన రాయితీ ధరలు అమల్లో ఉంటాయి.**రైతులకు అందుబాటు ధరల్లో ఎరువులు** పోషక ఆధారిత రాయితీ పథకం (ఎన్‌బీఎస్) కింద ఫాస్ఫేటిక్, పొటాషిక్ ఎరువులపై ప్రభుత్వం రాయితీ అందిస్తోంది. ప్రస్తుతం డీఏపీతో సహా 28 రకాల పీ అండ్ కే ఎరువులను ఈ పథకం ద్వారా రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు. ఎరువుల తయారీదారులు, దిగుమతిదారులకు ఆమోదించిన రేట్ల ప్రకారం రాయితీ చెల్లించనున్నారు. తద్వారా రైతులకు ఎరువుల సరఫరాలో అంతరాయం లేకుండా చూడటంతో పాటు ధరలను అందుబాటులో ఉంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. **డీఏపీ ధరపై ప్రత్యేక వెసులుబాటు** 50 కిలోల డీఏపీ బస్తా ధరను రూ.1,350 వద్ద కొనసాగించే ప్రత్యేక ఏర్పాటును కూడా కేంద్రం కొనసాగించనుంది. అంతర్జాతీయంగా ఎరువుల ధరలు పెరిగినప్పటికీ రైతులపై అదనపు భారం పడకుండా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రం తెలిపింది. రష్యాఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థపై ప్రభావం పడటంతో ఎరువుల ధరలు పెరిగాయి. ఈ నేపథ్యంలో రాయితీ పెంపు ద్వారా రైతులకు కొంత ఉపశమనం కల్పించాలని కేంద్రం నిర్ణయించింది.



రేపు ఏపీ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 11: ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. ఎన్నికల షెడ్యూల్‌ను నవంబర్ 13న విడుదల చేయనున్నట్లు సమాచారం. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు మీడియా సమావేశం నిర్వహించి ఎన్నికల వివరాలను వెల్లడించనున్నారు.రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. తొలి విడతకు నవంబర్ 13న, రెండో విడతకు నవంబర్ 16న, మూడో విడతకు నవంబర్ 19న నోటిఫికేషన్లు జారీ చేయనున్నారు. ఆయా విడతల్లో నవంబర్ 26, నవంబర్ 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ రోజే ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన కూడా ఉండనుంది.**మూడు విడతల్లో ఎన్నికల ప్రక్రియ** తొలి విడతలో నామినేషన్ల స్వీకరణకు నవంబర్ 17 చివరి తేదీగా నిర్ణయించారు. రెండో విడతకు నవంబర్ 20, మూడో విడతకు నవంబర్ 23 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత అభ్యర్థుల తుది జాబితాలను ప్రకటిస్తారు.**13,219 పంచాయతీలకు ఎన్నికలు** రాష్ట్రంలో 13,219 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, పోలింగ్ కేంద్రాలు, భద్రతా ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలతో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ సందడి మొదలుకానుంది. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల కోసం ఆశావహులు సిద్ధమవుతున్నారు.

జాతీయ సాయిలో మెరిసిన జీహెచ్ఎంసీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభాకర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అవార్డును స్వీకరించారు. **10,500 మార్కులతో మూల్యాంకనం** కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా నిర్వహించిన ఈ సర్వేలో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, ఘన వ్యర్థాల శుద్ధి, మురుగునీటి నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. మొత్తం 10,500 మార్కులతో పది ప్రధాన విభాగాల్లో నగరాల పనితీరును అంచనా వేశారు. 2026 ఏప్రిల్, మే నెలల్లో హైదరాబాద్‌లో క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించి పారిశుద్ధ్య సదుపాయాలు, చెత్త నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, ప్రజాభిప్రాయాలను మూల్యాంకనం చేశారు.**గతంలోనూ జాతీయ గుర్తింపులు** స్వచ్ఛతలో జీహెచ్ఎంసీ గతంలోనూ పలు గుర్తింపులు సాధించింది. 2017లో ఓడీఎఫ్ హోదా, 2019లో ఓడీఎఫ్++ గుర్తింపు, 2021లో వాటర్ ప్లస్ ధ్రువీకరణ పొందింది. 2024 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పది లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల విభాగంలో హైదరాబాద్ ఆరో ర్యాంకు సాధించింది. 2023లో ఐదు నక్షత్రాలు, 2024లో ఏడు నక్షత్రాల చెత్త రహిత నగర గుర్తింపులు లభించాయి.**ఇతర మున్సిపాలిటీలకు మార్గదర్శనం** స్వచ్ఛ షెహర్ జోడీ కార్యక్రమంలో భాగంగా మంథని, చేర్యాల మున్సిపాలిటీలకు జీహెచ్ఎంసీ మార్గదర్శక సంస్థగా వ్యవహరిస్తోంది. పారిశుద్ధ్య ప్రమాణాల మెరుగుదలకు శిక్షణ కార్యక్రమాలు, సామర్థ్య పెంపు శిబిరాలు నిర్వహిస్తోంది. ఈ జాతీయ గుర్తింపు నగర ప్రజలు, అధికారులు, పారిశుద్ధ్య కార్మికుల కృషికి దక్కిన గౌరవమని అధికారులు పేర్కొన్నారు.

హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని రంగనాథ్, తహసీల్దార్ దాఖలు చేసిన పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. తదుపరి విచారణకు వారిద్దరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించింది.**భూమి కూల్చివేతపై కోర్టు ధిక్కరణ పిటిషన్** శంషాబాద్ ప్రాంతంలోని సుమారు తొమ్మిది ఎకరాల భూమికి సంబంధించిన వివాదంలో కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి నిర్మాణాలను కూల్చివేశారంటూ మహమ్మద్ తాజాముల్లుద్దీన్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు తాజా ఆదేశాలు జారీ చేసింది. నవంబర్ 17న జరిగే తదుపరి విచారణలో అధికారులు హాజరుకావాల్సి ఉంది.

ఈ నెల 14న గిగ్ కార్మికుల భారీ ర్యాలీ

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 11: గిగ్ కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ఈ నెల 14న హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఈ ర్యాలీలో పాల్గొని కార్మికులతో సమావేశమవుతారని తెలిపారు. శిల్పకళా వేదిక నుంచి హెచ్‌ఐసీసీ వరకు ర్యాలీ కొనసాగుతుందని పేర్కొన్నారు.రాష్ట్రంలో సుమారు ఆరు లక్షల మంది గిగ్ కార్మికులు వివిధ డిజిటల్ వేదికలు, బహుళజాతి సంస్థల్లో పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆహార సరఫరా సిబ్బంది, క్యాబ్ డ్రైవర్లు, ఇతర సేవలందించే కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వారికి ప్రమాద బీమా, సామాజిక భద్రత, కనీస సంక్షేమ సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.**కార్మికుల నమోదు కోసం ప్రత్యేక యాప్** గిగ్ కార్మికుల వివరాల నమోదు, వారి సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను తీసుకురానున్నట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్స్ సంక్షేమ చట్టం అమలుకు సంబంధించిన నిబంధనలను సిద్ధం చేశామని తెలిపారు. సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.ఈ ర్యాలీ రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్నామని, కార్మికులు తమ రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా పాల్గొనవచ్చని మంత్రి స్పష్టం చేశారు. యాప్‌లో నమోదు చేసుకున్న గిగ్ కార్మికులు ర్యాలీలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. కార్మికులకు తగిన గుర్తింపు, గౌరవం, భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

సమ్మక్క బ్యారేజీకి కొత్త డీపీఆర్ రూపొందించాలి

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 11:

ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద నిర్మిస్తున్న సమ్మక్కసాగర్ బ్యారేజీకి కొత్తగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించాలని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది. గతంలో సమర్పించిన డీపీఆర్‌లో ఆయకట్టు వివరాలు పూర్తిస్థాయిలో లేవని అభ్యంతరం వ్యక్తం చేస్తూ, అవసరమైన మార్పులు చేసి మళ్లీ సమర్పించాలని తెలిపింది.ప్రాజెక్టు కింద సాగునీరు అందించే ప్రాంతాన్ని వందశాతం సర్వే చేసి వివరాలను ధ్రువీకరించాలని స్పష్టం చేసింది. ఇందుకోసం డ్రోన్లు, లైడార్, జీపీఎస్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించింది. కాలువల నిర్మాణం, భూసేకరణ, నీటి పంపిణీ వ్యవస్థకు సంబంధించిన వివరాలను కూడా డీపీఆర్‌లో పొందుపర్చాలని పేర్కొంది.మరోవైపు, ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) రావాల్సి ఉంది. బ్యారేజీలో నీటి నిల్వతో తమ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశాలపై ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం ఆ రాష్ట్రంతో చర్చలు జరుపుతోంది.సుమారు రూ.9,257 కోట్ల వ్యయంతో చేపట్టిన సమ్మక్కసాగర్ బ్యారేజీ నిర్మాణ పనులు 95 శాతం పూర్తయ్యాయి. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలకు సాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. కొత్త డీపీఆర్, ఇతర అనుమతులు పూర్తయిన తర్వాతే ప్రాజెక్టు తదుపరి ప్రక్రియ ముందుకు సాగనుంది.

బోడుప్పల్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

● బోడుప్పల్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) ఎన్. వేణుగోపాల్



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), నవంబర్11: బోడుప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బోడుప్పల్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) ఎన్. వేణుగోపాల్ తెలిపారు. బంగా రు మైసమ్మ దేవాలయం నుంచి ప్రివిలేజ్ కాలనీ వరకు హెచ్ఎమ్‌డీఏ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా 10 స్పాన్ల 11 కేవీ డిసిఓహెచ్ విద్యుత్ లైన్ల తరలింపు, నూతనంగా నిర్మిస్తున్న 33/11 కేవీ బిఎల్ నగర్ సబ్‌స్టేషన్ కోసం 11 కేవీ డిసిఓహెచ్ లైన్ స్ట్రింగింగ్ పనుల కారణంగా ఈ శట్‌డౌన్ విధిస్తున్నట్లు పేర్కొన్నారు. **ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిలిచిపోయే ప్రాంతాలు:** 33/11 కేవీ ఇందిరానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఎస్‌బిఆర్ కాలనీ ఫీడర్: పద్మావతి కాలనీ, అమ్మసాని వెంకట్‌రెడ్డి కాలనీ, ఆర్.ఎన్.ఎస్. కాలనీ, బిఎల్ నగర్, అంజయ్య ఎన్‌క్లేవ్, టెలిఫోన్ కాలనీ ఫేజ్-2, పిఎన్ఆర్ కాలనీ, రెడ్డిస్ కాలనీ, భవానీ నగర్, శుభోదయ కాలనీ, లెక్చరర్స్ కాలనీ, గ్రీన్ సిటీ కాలనీ, అనాగపూరి కాలనీ, భీంరెడ్డి కాలనీ, ఎన్ఐఎన్ కాలనీ లు ఉన్నాయి.11 కేవీ వివేకానంద కాలనీ ఫీడర్: మణికంఠ నగర్, వివేకానంద నగర్, శ్రీ లక్ష్మీనగర్, లెక్చరర్స్ కాలనీ, ఐఐసిటి కాలనీ, అశోక్ నగర్ లు ఉన్నాయి.11 కేవీ మారుతీ నగర్ ఫీడర్: యాదవ్ బస్తీ, సుభాష్ నగర్, ఎస్సీ బస్తీ, మాన్సాని కాలనీ, మణికంఠ నగర్, మారుతీ నగర్, టెలిఫోన్ కాలనీ, యాదాద్రి కాలనీ, సిద్ధివినాయక చిత్తారి నగర్, శ్రీ సాయి ఎన్‌క్లేవ్ లు ఉన్నాయి.సంబంధిత ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి శాఖ సిబ్బందికి సహకరించాల్సిందిగా ఏఈ విజ్ఞప్తి చేశారు.

నిరుపేద కుటుంబాలకు లయన్స్ క్లబ్ ఆర్థిక చేయూత

మానవత్వంతో ఆపన్నులకు అండగా నిలవడం అభినందనీయం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అతహర్ పాష





తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 11: ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో చౌటుప్పల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన బొడ్డు కవిత, చేపూరి సుస్మిత కుటుంబాలకు బుధవారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అతహర్ పాష చేతుల మీదుగా సహాయాన్ని అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ.9 వేల విలువైన కిరాణా సరుకులతో పాటు రూ.5 వేల నగదును అందించారు. రెండు కుటుంబాలకు కలిపి మొత్తం రూ.28 వేల విలువైన ఆర్థిక సహాయం అందించడం విశేషం.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అతహర్ పాష మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు అండగా నిలవడమే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాలుగో వార్డు కౌన్సిలర్ ఊదరి యాదయ్య, లయన్స్ క్లబ్ కార్యదర్శి దాచేపల్లి రాజు, లయన్స్ సభ్యులు నాంపల్లి రమేష్, కాసుల వెంకటేశం, కటికం ప్రశాంత్, సిలివేరు మంగయ్య, గోపగోని లక్ష్మణ్ గౌడ్ తదితరులతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు

జయపురం పాఠశాలలో నూతన మూత్రశాలలు ప్రారంభించిన సర్పంచ్ రేణుక అశోక్‌రెడ్డి



తొలిఅక్షరం /నర్సింహులపేట నవంబర్ 11: మండలంలోని జయపురం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన మూత్రశాలలను గ్రామ సర్పంచ్ నెలకుర్తి రేణుక అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఎంఈఓ రాంమోహన్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, ఉపసర్పంచ్ చుక్క వేణు, ఏఏపీసీ చైర్మన్ సరితతో కలిసి ఆమె ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ రేణుక అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో పాఠశాలలో నూతన మూత్రశాలలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంతో పాటు వారి అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి గ్రామ పంచాయతీ తరఫున ఎల్లవేళలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ పాఠశాలలో అవసరమైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు మందుల రాంమూర్తి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ నాయకులు అశోక్‌రెడ్డి, ఐలయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాలకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి ఆహ్వానం

- ఈ నెల 14న చౌటుప్పల్ గాంధీ పార్కులో వేడుకలు



తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 11: చౌటుప్పల్ పట్టణంలో ఈ నెల 14న నిర్వహించనున్న సదర్ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని యాదవ సంఘం నాయకులు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు.శనివారం సాయంత్రం 5 గంటల నుంచి గాంధీ పార్కులో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతకు ప్రతీకగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మస్తాన్‌బాబు యాదవ్, జక్కిలి ఐలయ్య యాదవ్, చిలుకల శ్రీనివాస్ యాదవ్, ఆవుల యేసు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు మహాసభల విజయానికి విస్తృత ప్రచారం

- నల్లగొండ బహిరంగ సభకు తరలిరావాలని చింతల సుదర్శన్ పిలుపు



తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 11: నల్లగొండలో నవంబర్ 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న ఆల్ ఇండియా కిసాన్ రైతు సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని చింతల సుదర్శన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ మండలంలోని పలు గ్రామాల్లో వాల్ పోస్టర్లు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు.నవంబర్ 15న జరిగే భారీ బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కార్మికులు, కూలీలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని చింతల సుదర్శన్ అన్నారు. ఈ కార్యక్రమంలో గంగాదేవి సైదులు, యనమల సంజీవ, కంచర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ఇండో స్కూల్ విద్యార్థుల ప్రతిభ

80 మీటర్ల పరుగులో సందీప్ కు రజతం

క్రీడా పోటీల్లో సత్తా చాటిన షాద్‌నగర్ విద్యార్థులు

క్రీడాకారులను అభినందించిన చైర్మన్ చిన్నబాతిని సాగర్





తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 11: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ స్పోర్ట్స్ ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో షాద్‌నగర్ ఇండో స్కూల్ విద్యార్థులు తమ క్రీడా ప్రతిభను చాటుకున్నారు. అండర్-6, అండర్-8, అండర్-10, అండర్-12 విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన 45 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ క్రీడాంశాల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ పోటీల్లో ప్రతిభ కనబరిచారు.ముఖ్యంగా అండర్-6 విభాగంలో నిర్వహించిన 80 మీటర్ల పరుగుపందెంలో విద్యార్థి సందీప్ ద్వితీయ స్థానం సాధించి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. చిన్న వయసులోనే క్రీడల్లో ప్రతిభ కనబరిచి పతకం సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. విద్యార్థులు క్రీడాలో సాధించిన విజయంతో పాఠశాలలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.పతక విజేత సందీప్‌తో పాటు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల చైర్మన్ చిన్నబాతిని సాగర్ అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేలా పాఠశాల యాజమాన్యం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపల్స్ సాయి కిరణ్, మంజు భార్గవి, పీఈటీ నారాయణ, మనసా తదితరులు విద్యార్థులను అభినందించారు.

కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ శంకుస్థాపన...

మైరా క్లినిక్ ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టితో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క కాజీపేటలోనీ పెద్దబడి ప్రాంగణంలో నూతనంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో,స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య,ఎంపీ కడియం కావ్యతో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజుపాల్గొన్నారు.అనంతరం రాష్ట్ర టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ నామిండ్ల శ్రీనివాస్ కుమార్తె డా.మౌనిక హనుమకొండ నక్కలగుట్టలో నూతనంగా ఏర్పాటు చేసిన మైరా క్లినిక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా క్లినిక్ డాక్టర్ మౌనిక కు అభినందనలు,కృతజ్ఞతలు తెలియజేశారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,రెడ్ క్రాస్ డైరెక్టర్ ఈవీ శ్రీనివాస్ కుమార్తె వివాహ సందర్భంగా శ్రీనివాస్ దంపతులకు శు భాకాంక్షలు తెలిపి వారి కుమార్తెను ఆశీర్వదించారు.అనంతరం నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్,కూడా చైర్మన్ గుండు సుధారాణి,హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయుబ్,జిల్లా ఎస్సీ సెల్ చైర్మెన్ సిలువేరు శ్రీనివాస్,మాజీ కార్పొరేటర్లు,చైర్మన్లు, సర్పంచులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు,నాయకులు కార్యకర్తలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై న్యాయవాదులు అవగాహన పెంచుకోవాలి

- కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలి: న్యాయమూర్తి గౌస్ పాషా



తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 11: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తి ఎం.డి. గౌస్ పాషాను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరి పరమేష్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తిని శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.న్యాయవ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా న్యాయవాదులు నూతన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని తాడూరి పరమేష్ సూచించారు. న్యాయమూర్తి, న్యాయవాదుల మధ్య సమన్వయంతో కక్షిదారులకు సత్వర న్యాయం అందించవచ్చని పేర్కొన్నారు. న్యాయవాదులు బాధ్యతాయుతంగా పనిచేసి, వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంచుకోవాలని న్యాయమూర్తి గౌస్ పాషా సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

13 ఏళ్లుగా అయ్యప్ప దీక్ష.. ఆధ్యాత్మిక సేవే లక్ష్యంగా దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి ప్రస్థానం!

● శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప దేవాలయ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు ● ఆలయ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన గోవర్ధన్ రెడ్డి

తొలి అక్షరం/చౌటుప్పల్: నవంబర్ 11: భక్తి, సేవ, ఆధ్యాత్మికతను జీవితంలో భాగంగా చేసుకొని నిరంతరం దైవచింతనలో సాగుతున్న వ్యక్తి దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి. గత 13 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా అయ్యప్ప మాల ధరిస్తూ, భక్తిశ్రద్ధలు, నియమ నిష్ఠలతో అయ్యప్ప స్వామి సేవలో కొనసాగుతున్నారు. తన ఆధ్యాత్మిక జీవన విధానం ద్వారా ప్రజలకు దైవభక్తి, ధర్మం, భక్తి మార్గం గొప్పతనాన్ని చాటుతున్నారు. శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప దేవాలయ నిర్మాణంలో గోవర్ధన్ రెడ్డి కీలక బాధ్యతలు చేపట్టి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నారు. దేవాలయ నిర్మాణం నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ వరకు తనకు అప్పగించిన బాధ్యతలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆయన సేవలు, అంకితభావాన్ని గుర్తించి తాజాగా దేవాలయ నూతన అధ్యక్షుడిగా నియమించడం విశేషం. **13 ఏళ్ల అయ్యప్ప దీక్ష.. ఆధ్యాత్మిక సేవలో నిరంతర ప్రయాణం!** అయ్యప్ప స్వామిపై అపారమైన భక్తి కలిగిన గోవర్ధన్ రెడ్డి నూతన అధ్యక్ష బాధ్యతలతో ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేయాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు. ఆయన నాయకత్వంలో శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప దేవాలయం మరింత అభివృద్ధి చెంది, భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లాలని కోరుకుంటున్నారు. భక్తి మార్గంలో సాగుతూ.. సేవా కార్యక్రమాలతో సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్న దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి అన్న గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు. ఆయన చేపట్టిన నూతన బాధ్యతలు విజయవంతం కావాలని, అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తున్నాం.



ఇ.ఎల్.వి. ఫౌండేషన్ సేవలకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలి

● అసత్య ప్రచారాలను ఐక్యంగా ఎదుర్కోవాలి.. సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి



తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 11: సమాజ సేవే లక్ష్యంగా పనిచేస్తున్న ఇ.ఎల్.వి. భాస్కర్ అన్న ఫౌండేషన్ సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పలువురు కోరారు. ఇప్పటికే పేద కుటుంబాలకు విద్య, వైద్యం, ఉద్యోగ రంగాల్లో సహాయం అందిస్తూ ఫౌండేషన్ సేవలందిస్తోందని పేర్కొన్నారు. ఫౌండేషన్‌పై వస్తున్న అసత్య ప్రచారాలను సభ్యులు ఐక్యంగా ఎదుర్కొంటూ, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉంటూ సేవా కార్యక్రమాల ద్వారా సమాధానం చెప్పాలని కోరారు. రాజకీయాలకు, స్వార్థ ప్రయోజనాలకు అతీతంగా మరిన్ని పేద కుటుంబాలకు అండగా నిలిచి, ఫౌండేషన్ సేవా ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 11: న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా రామన్నపేట గ్రామ పంచాయతీ ప్రాంగణంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష ప్రజలకు న్యాయ సేవల ప్రాముఖ్యత, ఉచిత న్యాయ సహాయం పొందే విధానం, న్యాయ సేవాధికార సంస్థ అందించే సేవలను వివరించారు. ప్యానల్ అడ్వకేట్ కూనూరు శ్రీనివాస్ న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోట్ రమేష్, పంచాయతీ కార్యనిర్వాహక అధికారి వి. సైదిరెడ్డి, వార్డు సభ్యులు, న్యాయ సహాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా రెబ్బాస్ రాములు ఎన్నిక

తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 11: యాదాద్రి జిల్లా ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా కామ్రేడ్ రెబ్బాస్ రాములు నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు చీమ శ్రీనివాస్‌కు, సహకరించిన రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ ఎస్.కె. చాంద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్నకు రాములు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నోముల శంకర్, బొడ్డుపల్లి లింగయ్య, ఎండి ఇమామ్ సాబ్, గొలుసుల ప్రసాద్, ఆవుల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మన్నేపల్లి వెంకటేశ్వరావుకు బానోత్ సుందర్ లాల్ ఘన నివాళి

- దశదిన కర్మకు హాజరై కుటుంబ సభ్యులకు పరామర్శ



తొలి అక్షరం/ ఏన్కూర్ నవంబర్ 11: ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం ఏన్కూరు మండలం రాయమాధారం గ్రామానికి చెందిన మన్నేపల్లి వెంకటేశ్వరావు దశదిన కర్మ కార్యక్రమానికి వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు బానోత్ సుందర్ లాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరావు చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి కుటుంబానికి మనోధైర్యం కల్పిస్తూ, దుఃఖంలో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కనకంచి వెంకటేశ్వర్లు, షేక్ బబ్లూ, మాలోత్ బాల తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో వర్షాభావ పరిస్థితుల్లో, పంట మార్పిడిపై రైతులకు అవగాహన





తొలిఅక్షరం/నెల్లికుదురు నవంబర్ 11: నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామంలో ఎల్ నీ నో ప్రభావం పై రైతులకి అవగాహన సదస్సు నిర్వహించారు.గ్రామ సర్పంచ్ మాదరి ప్రశాంత్ నెల్లికుదురు వ్యవసాయ అధికారి మహేందర్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల ప్రభావం, భూగర్భ జలాల తగ్గుదల వల్ల వ్యవసాయ రంగంలో ఎదురయ్యే సమస్యలను వివరించారు. వర్షాభావ పరిస్థితులనుఅధిగమించేందుకు రైతులుప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని, పంట మార్పిడి విధానాలను అవలంబించాలని సూచించారు.ప్రకృతి పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకుంటూ, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ద్వారా వ్యవసాయంలో నష్టాలను తగ్గించుకోవచ్చని రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రామగిరి సుమన్, ఏఇవో ప్రతిభ, పంచాయతీ సెక్రటరీ మౌనిక, పిఏసిఎస్ సెక్రటరీ కత్తుల వెంకన్న, పిఏసిఎస్ డైరెక్టర్స్ మద్దెల సమ్మయ్య, బెల్లి నర్సయ్య,గ్రామ రైతులు, అనుముల రవీందర్, బొమ్మిడీ వినోద్ రెడ్డి,గుర్రాల నరేష్, పోతారాజ్ యాకన్నా తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ రైతు మహాసభలను జయప్రదం చేయండి



తొలి అక్షరం/నెల్లికుదురు, నవంబర్ 11: ఈ నెల 15 నుంచి 18 వరకు నల్లగొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ 36వ మహాసభలను, 15న జరిగే రైతు బహిరంగ సభను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గునగంటి రాజన్న; జిల్లా కోశాధికారి ఆకుల రాజు పిలుపునిచ్చారు. బుధవారం నెల్లికుదురు వ్యవసాయ మార్కెట్ నుంచి ప్రచార జాతను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతాంగ హక్కుల పరిరక్షణ, రైతుల సమస్యల పరిష్కారం కోసం అఖిలభారత కిసాన్ సభ నిరంతరం పోరాడుతోందన్నారు. కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలు, మతతత్వ రాజకీయాల వల్ల రైతులు, గ్రామీణ శ్రామికులు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బొబ్బాల యాకుబ్‌రెడ్డి, ఇసంపల్లి సైదులు, పెరుమాండ్ల బాబుగౌడ్, తోట నర్సయ్య, బానాల యాకయ్య, తోట శ్రీను, అచ్చ నగేష్, బండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను ఆశీర్వదించిన గర్దాసు విక్రమ్



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 11: ఆర్‌బీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఇంద్రపాలనగరం పాల సంఘం చైర్మన్ కంబాలపల్లి శ్రీశైలంజ్యోతి దంపతుల కుమార్తె, కుమారుడి నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుకలో తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం జేఏసీ కార్యదర్శి, ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్దాసు విక్రమ్ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

కొత్త ఎస్ఐ హరితకు ఘన సన్మానం



తొలి అక్షరం/కొణిజర్ల , నవంబర్ 11: కొణిజర్ల మండలానికి బదిలీపై వచ్చి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ హరితను గుబ్బగుర్తి సర్పంచ్ దంతాల ప్రశాంతి, కాంగ్రెస్ నాయకుడు దంతాల నరసింహారావు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండల ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

నీర్నెములలో కార్తీక మాస మహాత్మ్య ప్రవచనం

- దీపాల వెలుగులతో భక్తిమయంగా మారిన గ్రామం



తొలి అక్షరం/నీర్నెముల, నవంబర్ 11: కార్తీక మాసం సందర్భంగా నీర్నెముల గ్రామంలోని శివాలయంలో కార్తీక మాస మహాత్మ్య ప్రవచన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ బేతోజు సత్యనారాయణ శాస్త్రి కార్తీక మాస విశిష్టత, దీపారాధన, శివారాధన ప్రాముఖ్యతను వివరించారు. దీపదానం, అన్నదానం, శివనామ స్మరణ ఎంతో పుణ్యప్రదమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు బేతోజు శశిధర్, కళాధర్, బేతోజు విజ్ఞేశ్వర రాణి పూజలు నిర్వహించారు. బత్తుల కోటేశ్వర్‌రెడ్డి, బత్తుల సులోచన, వల్లే భారతమ్మ, వల్లే చంద్రకళ, సుర్వి సరస్వతి, రేవనాల ఝాన్సీతో పాటు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు.

అఖిల భారత కిసాన్ సభను జయప్రదం చేయాలి

- 15న నలగొండలో జరిగే భారీ బహిరంగ సభకు రామన్నపేట నుండి రెడ్ షర్ట్ వాలంటీర్ల కావతు



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 11: అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభ సందర్భంగా ఈనెల 15న నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగే బహిరంగ సభలో యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్రు అనిల్ కుమార్ అన్నారు రామన్నపేట మండల కేంద్రంలో జరిగిన రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ బహిరంగ సభ సందర్భంగా నిర్వహించే భారీ ప్రదర్శన ముందు భాగంలో పదివేల మంది రెడ్ షర్ట్ వాలంటీర్ల కవతు కోసం ఈ ఈ శిక్షణ రామన్నపేట నుండి యువకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు మెట్టు శ్రావణ్ కార్యదర్శి శానాగొండ రాము ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఈర్ల రాహుల్ ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్ నాయకులు మేడి ముకుందా అప్పం సురేందర్ ఎర్ర బిక్షపతి పిట్టల నవీన్ చింతల రాజు తదితరులు పాల్గొన్నారు

మృతురాలు బానోత్ కైకకు ఎమ్మెల్యే దొంతి నివాళి





తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 11: వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పెద్దకొర్పోల్ రేకుల తండాకు చెందిన బానోత్ కైక మృతి చెందగా, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆమె నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిదురాల సత్యనారాయణకు ఎమ్మెల్యే దొంతి నివాళి



తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 11: నెక్కొండ మండల కేంద్రానికి చెందిన చిదురాల సత్యనారాయణ మృతి చెందగా, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆయన నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా సీఎంఆర్ బియ్యం సరఫరా చేయాలి



తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో, నవంబర్ 11: నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సీఎంఆర్ బియ్యాన్ని రోజువారీగా సరఫరా చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కె. అనిల్‌కుమార్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ 202627 సీజన్‌కు ధాన్యం కేటాయింపులు పొందేందుకు అర్హులైన మిల్లర్లు వెంటనే మిల్లర్ అగ్రిమెంట్, బ్యాంకు గ్యారంటీ సమర్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి జె. రమేష్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ జి. మనోజ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలి

- బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు విట్యాల నరసింహ



తొలి అక్షరం/రంగారెడ్డి, నవంబర్ 11: ఎస్సీ వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, సబ్సిడీ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు విట్యాల నరసింహ కోరారు. బుధవారం రంగారెడ్డి కలెక్టరేట్‌లోని షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సమితి కార్యాలయాన్ని సందర్శించి, పథకాల అమలు, లబ్ధిదారులకు అందుతున్న ఆర్థిక సహాయంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, ఎలాంటి జాప్యం లేకుండా ప్రయోజనాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోపి నరసింహులు, బొబ్బిలిగామా మల్లేష్, సంగెం శివకుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా కొత్త చేయూత పింఛన్ల లబ్ధిదారులకు ఈనెల మంజూరు పత్రాలను పంపిణీ



తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 11:తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కొత్త చేయుత పింఛన్ లబ్ధిదారులకు ఈనెల 12 నుంచి 18 వరకు మంజూరు పత్రాలను పంపిణీ చేయనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధుల ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో సైతం మంజూరు పత్రాలను అందజేయనున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం 19వ తేదీన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పింఛన్ మొత్తాన్ని జమచేసే విధంగా సంబంధిత విభాగాలు ఏర్పాట్లు చేస్తున్నాయి.కొత్తగా మంజూరు చేసిన చేయూత పింఛన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు అర్హులైన దరఖాస్తుదారుల పెండింగ్ వెరిఫికేషన్, ఆమోద ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని సూచిస్తూ.. గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) సీఈఓ దివ్య దేవరాజన్ సర్క్యులర్ జారీ చేశారు. సంబంధిత ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రులను ప్రొటోకాల్ ప్రకారం ఈ ప్రత్యేక కార్యక్రమాలకు ఆహ్వానించాలని అధికారులకు సూచించారు. చేయూత పింఛన్లకోసం దరఖాస్తు చేసుకున్న వారికి అభ్యంతరాలు, సమస్యలుంటే పరిష్కరించేందుకు ప్రతి కార్యక్రమ వేదిక వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్ సూచించారు.

శ్రామిక బడి విద్యార్థులకు స్టీల్ భోజన ప్లేట్లు బహుకరణ

- పాతూరి వెంకటరావు, మండవ మురళి సేవలు మరువలేనివి అంటూ ప్రశంస





తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 11:పౌల్ట్రీ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలనే సత్సంకల్పంతో ఏర్పాటు చేసిన శ్రామిక బడి పిల్లలకు ప్రముఖ పౌల్ట్రీ పారిశ్రామికవేత్త పాతూరి వెంకటరావు, పౌల్ట్రీ రైతు మండవ మురళి ప్రత్యేకంగా స్టీల్ భోజన ప్లేట్లను అందజేశారు.మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు ఎంపీ శేషయ్య నగర్ కమ్యూనిటీ హాల్ లో ఈ శ్రామిక బడి కొనసాగుతోంది. షాద్‌నగర్ మండల విద్యాధికారి మనోహర్ నేతృత్వంలో నిర్వహించిన 'బడిబాట' కార్యక్రమంలో భాగంగా పౌల్ట్రీ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలను సర్వే చేసి, సుమారు 70 మంది విద్యార్థులను గుర్తించారు.బడికి దూరమవుతున్న ఈ పిల్లల చదువు కోసం ప్రముఖ పౌల్ట్రీ పారిశ్రామికవేత్త పాతూరి వెంకటరావు ముందుకు వచ్చి, కమ్యూనిటీ హాల్ లోనే ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేయించారు. అంతేకాకుండా విద్యార్థులకు బోధన అందించడానికి ఒక విద్యా వాలంటీర్‌ను నియమించి, వారికి నెలానెలా స్వయంగా వేతనం చెల్లిస్తూ తమ ఉదారతను చాటుకుంటున్నారు.ఈ క్రమంలో బడిలో మధ్యాహ్న భోజనం చేయడానికి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించి, పౌల్ట్రీ రైతు మండవ మురళి సహకారంతో పిల్లలందరికీ స్టీల్ ప్లేట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కార్మిక నేత పినపాక ప్రభాకర్, ఉపాధ్యాయులు సత్యం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొని, నిరుపేద పిల్లల విద్య కోసం నిరంతరం కృషి చేస్తున్న పాతూరి వెంకటరావు, మండవ మురళిల సేవా నిరతిని కొనియాడారు.

ఖాజీపేట వైఎస్ఆర్ నగర్ గుడిసెలను కాపాడాలని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్కకు వినతి పత్రం సమర్పించిన డాక్టర్ కేడల ప్రసాద్ పటేల్...



తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి: ఖాజీపేట వై ఎస్ ఆర్ నగర్ గుడిసెలను కాపాడాలని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క కు వినతి పత్రం సమర్పించిన డాక్టర్ కేడల ప్రసాద్ పటేల్ పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేసి,పూల గుచ్చం అందచేసిన అనంతరం... 2005 లో వై ఎస్ రాజ శేఖర్ రెడ్డి అదే స్థలంలో బహిరంగ సభలో ప్రకటించిన 120 గుడిసెల ను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వశే తీసివేసే ప్రయత్నం చేయడం ఎంత వరకు సమంజసం అని,వై ఎస్ ఆర్ నగర్ గుడిసెలను రక్షించాలని,మిగిలిన సుమారు ఆరు ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని,ఖాజీపేట రైల్వే స్టేషన్ కు కూత వేటు దూరంలో ఉన్న ఆ ప్రభుత్వ స్థలంలో ఖాజీ పేట బస్ స్టాండ్,ఖాజీపేట మండల తహసీల్దార్ కార్యాలయం,మున్సిపల్ కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని భట్టికి విన్నవించడశే జరిగింది.ఉప ముఖ్యమంత్రి ని కలిసిన వారిలో కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి మోడెమ్ రాజేందర్ గౌడ్,సామాజిక వేత్త తంపుల మొగిలి తదితరులు ఉన్నారు.

మహిళా సర్పంచుల శిక్షణకు ఎలికట్ట సర్పంచ్

- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఆశీస్సులు పొందిన నవకిరణి





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 11: మహిళా ప్రజాప్రతినిధులకు పాలనాపరమైన అవగాహన కల్పించడంతోపాటు గ్రామాల అభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమానికి ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ సర్పంచ్ బుద్ద నవకిరణి నరసింహ హాజరయ్యారు. హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నవంబర్ 10 నుంచి 12వ తేదీ వరకు మూడు రోజులపాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న ఆమె గ్రామ పరిపాలన, అభివృద్ధి పనుల ప్రణాళిక, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై అవగాహన పెంచుకుంటున్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఎలికట్ట గ్రామ అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రిని కోరారు. గ్రామ ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ, ప్రభుత్వ సహకారంతో ఎలికట్టను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సర్పంచ్ నవకిరణి నరసింహ తెలిపారు.

డిగ్రీ కళాశాలల ఆర్టీఎఫ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- **ఎంపీ, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డికి వినతి**
- **సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ**



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 11: డిగ్రీ కళాశాలలకు సంబంధించిన ఆర్టీఎఫ్ (రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీజు), స్కాలర్‌షిప్‌ల గత మూడేళ్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ టీపీజేఎం రాష్ట్ర అధ్యక్షుడు, చైర్మన్ గౌరీ సతీష్, చేవెళ్ల ఇన్‌చార్జి భీమ్ భరత్, తెలంగాణ గ్రాడ్యుయేట్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణాకర్ ప్రభుత్వ సలహాదారు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా డిగ్రీ కళాశాలలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను, ముఖ్యంగా గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీఎఫ్, స్కాలర్‌షిప్ బకాయిల వల్ల కళాశాలల నిర్వహణపై పడుతున్న భారాన్ని ఆయనకు వివరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పెండింగ్ బకాయిలను త్వరితగతిన విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తిపై వేం నరేందర్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, డిగ్రీ కళాశాలల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వైఎస్ఆర్ నగర్ గుడిసెవాసులకు న్యాయం చేయాలి

- **పట్టాలపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే భట్టి పర్యటనను అడ్డుకుంటాం: దాస్యం వినయ్ భాస్కర్**



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: వైఎస్ఆర్ నగర్ గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసే విషయంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. కాజీపేట ప్రెస్‌క్లబ్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గుడిసెవాసులపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని, వారి తరఫున పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన కేసులు తొలగించాలని కోరారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, లేనిపక్షంలో భూమిని వారికే దక్కేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటనలోపు న్యాయం చేయకపోతే పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు.


అయ్యప్ప సన్నిధానం అభివృద్ధికి రవీందర్

యాదవ్ రూ.35 వేల విరాళం

ఆలయ అభివృద్ధికి బీఆర్ఎస్ నేత ఆర్థిక చేయూత

భక్తి సేవలో రవీందర్ యాదవ్.. అయ్యప్ప సన్నిధానానికి విరాళం





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 11: భక్తి మార్గంలో సేవా సంకల్పంతో ఆలయ అభివృద్ధికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎల్లనమోని రవీందర్ యాదవ్ తనవంతు సహకారం అందించారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలోని హనుమాన్ దేవాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి సన్నిధానం అభివృద్ధికి రూ.35 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సన్నిధానంలో ఫ్లోరింగ్ బండల ఏర్పాటు కోసం ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు. రవీందర్ యాదవ్ అందించిన ఆర్థిక సహకారం పట్ల గ్రామస్తులు, అయ్యప్ప స్వామి భక్తులు హర్షం వ్యక్తం చేశారు. భక్తి భావంతో ముందుకొచ్చి సన్నిధానం అభివృద్ధికి చేయూతనివ్వడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బుగ్గ కృష్ణ, గ్రామ బీఆర్ఎస్ నాయకులు, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు తమ నైపుణ్యతను నిరూపించుకోవాలి...

జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి పసునూరి రాజేంద్రప్రసాద్





తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో నవంబర్ 11: ప్రతి ఒక్కరు తమ నైపుణ్యతను నిరూపించుకోవాలని జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి పసునూరి రాజేంద్రప్రసాద్ సూచించారు.బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు, కళాకారుల ఎంపిక కార్యక్రమం ఘనంగా జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సిహెచ్ మదర్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఓలేటి జ్యోతి, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం యువత సన్మార్గంలో నడవడం కోసం జిల్లా రాష్ట్రస్థాయి జాతీయస్థాయిలో యువజన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్వారా యువతీ యువకుల్లో ప్రతిభను వెలికితీయడానికి ఇది మంచి వేదిక అవుతుందని అన్నారు.జిల్లా క్రీడల, యువజన శాఖ అధికారి జ్యోతి మాట్లాడుతూ జిల్లాస్థాయి సాంస్కృతిక జానపద కళాకారుల ఎంపిక కార్యక్రమంలో భాగంగా లైవ్ చిత్రలేఖనం, వ్యాసరచన, జానపద గీతాలు, జానపద నృత్యాలు, సామాజిక అంశాలపై స్కిట్, తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో అధికంగా యువత ఉన్న భారతదేశంలో మేధస్సుకు కొదవలేదని ప్రతి ఒక్కరూ తమ యొక్క టాలెంటును నిరూపించుకోవాలని సూచించారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాలలో చిత్రలేఖనం మొదటి బహుమతి బి పావని, రెండవ బహుమతి రక్షిత, కవిత్వంలో ఉదయ సోస్, రెండవ బహుమతి భరత్ కుమార్, సామాజిక అంశాలపై స్కిట్ తెలంగాణ మోడల్ స్కూల్ నేరెడ,జానపదా నృత్యాలు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజ్, రెండవ బహుమతి ప్రభుత్వ జూనియర్ కాలేజ్ మహబూబాబాద్,జానపద పాటలు మహబూబాబాద్ జూనియర్ కాలేజ్, తదితర కళాశాల విద్యార్థిని విద్యార్థులు బహుమతులు పొందారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపల్ గణేష్, న్యాయ నిర్ణయితలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల అభివృద్ధికి రూ.2 కోట్ల అదనపు నిధులు కోరిన నాయకులు

-మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌కు వినతిపత్రం అందజేత





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 11: షాద్‌నగర్ నియోజకవర్గంలో మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల కోసం అదనంగా రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌ను కాంగ్రెస్ నాయకులు కోరారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచన మేరకు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానాల మరమ్మతులు, పునరుద్ధరణతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఉర్దూ పాఠశాలల అభివృద్ధి, మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేయాలని కోరారు. అనంతరం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా ఖత్వాల్‌ను కలిసి సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఫయూమ్, అబ్దుల్ ఖదీర్, మహమ్మద్ ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలతో ఎండుతున్న వరి పంటలు

రైతులకు పరిహారం చెల్లించాలి: మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి





తొలి అక్షరం/మహమ్మదాబాద్, నవంబర్ 11: విద్యుత్ సరఫరా సక్రమంగా లేక వరి పంటలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం మహమ్మదాబాద్, గండీడ్, హన్వాడ మండలాల్లో పర్యటించి ఎండిన పంటలను పరిశీలించి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్కువ వోల్టేజీతో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే విద్యుత్ సరఫరాను మెరుగుపరచి, ఎండిన పంటలపై సమగ్ర సర్వే నిర్వహించి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

నిరుపేద కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చేయూత

● ఇంటి ఫినిషింగ్ పనులకు సిమెంట్ బస్తాల అందజేత



తొలి అక్షరం/మాడుగుల,నవంబర్ 11: నిరుపేద కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. మాడుగుల మండలం నాగిళ్ల గ్రామానికి చెందిన పాలకూర్ల వెంకటయ్య కుటుంబం ఇంటి నిర్మాణం పూర్తి చేసుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ స్పందించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇంటి ఫినిషింగ్ పనుల నిమిత్తం కుటుంబానికి సిమెంట్ బస్తాలను అందజేశారు. ఆపదలో ఉన్న తమ కుటుంబానికి సహకారం అందించిన ఉప్పల వెంకటేష్‌కు, ఇందుకు తోడ్పాటునందించిన గ్రామ సర్పంచ్ సంతోష రాజు గౌడ్‌కు వెంకటయ్య కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేద కుటుంబాలకు అండగా నిలవడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సురమల చెన్నయ్య, పాలకూర్ల వెంకటయ్య, శేఖర్, లక్ష్మయ్య, బందెల జగన్, చాట్ల యాదయ్య, వడ్డెమోని శ్రీకాంత్, రమేష్, శ్రీశైలం, జంగయ్య, దశరథం, వెంకటేష్, పల్లకి నరసింహ పాల్గొన్నారు.

సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడిగా గణేశ్‌రెడ్డి ఎన్నిక

- గణేశ్‌రెడ్డికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందనలు

- కాంగ్రెస్ సేవాదళ్ బలోపేతానికి కృషి చేయాలి: ఎమ్మెల్యే శంకర్



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 11: తెలంగాణ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన పి. గణేశ్‌రెడ్డి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు కీలక బాధ్యతలు అప్పగించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన గణేశ్‌రెడ్డిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సేవాదళ్ నాయకులు కృషి చేయాలని సూచించారు. పార్టీ ప్రతిష్టను పెంపొందించడంతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సేవాదళ్‌కు మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే భూ హద్దుల నిర్ధారణ చేపట్టాలి

- భూ రీసర్వే పారదర్శకంగా నిర్వహించాలి: కలెక్టర్ సి. నారాయణ రెడ్డి





తొలి అక్షరం/రంగారెడ్డి జిల్లా, నవంబర్ 11: భూ రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలం రాందాస్‌పల్లి గ్రామంలో చేపట్టిన భూ రీసర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల భూముల హద్దుల గుర్తింపు తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి రైతుకు సంబంధించిన భూమి సరిహద్దులను కచ్చితంగా నిర్ధారించాలని సూచించారు.సర్వే నిర్వహణకు కనీసం 24 గంటల ముందే పట్టాదారులకు నోటీసులు అందించాలని స్పష్టం చేశారు. రైతుల సమక్షంలోనే భూముల హద్దులను గుర్తించి, అవసరమైన చోట ఫ్లాగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. సర్వే వివరాలు, రెవెన్యూ రికార్డుల్లో వ్యత్యాసాలు ఉంటే నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు. రైతులకు సర్వేపై పూర్తి అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేయాలన్నారు. సర్వేలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, ఏడీ రాంరెడ్డి, తహశీల్దార్ సునీత, సర్వేయర్లు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



చంద్రకళ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

- దళిత కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, మూడు ఎకరాల భూమి ఇవ్వాలి

తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 11: శాతవాహన విశ్వవిద్యాలయంలో న్యాయ విద్య అభ్యసిస్తున్న దాకూరి చంద్రకళ అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజా, హక్కుల సంఘాల నాయకులు టీజీ శ్రీనివాస్, తిరుమలయ్య, అర్జునప్ప, రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. పేదరికాన్ని అధిగమించి ఉన్నత చదువులు అభ్యసించిన చంద్రకళ మృతి తీవ్ర విషాదకరమన్నారు. ఈ నెల 12న మధ్యాహ్నం 2 గంటలకు షాద్‌నగర్ పెన్షనర్ భవన్‌లో సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.చంద్రకళ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని, షాద్‌నగర్‌లో నివసిస్తున్న దళిత కుటుంబాలన్నింటికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. చంద్రకళ కుటుంబానికి మూడు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లో మహిళల భద్రతకు కౌన్సెలింగ్, భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సంస్మరణ సభకు ప్రజా, హక్కుల సంఘాల నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

భవిష్యత్తు తరాల కోసమే చెరువుల పరిరక్షణ

మాదాపూర్‌లో 'తమ్మిడికుంట' చెరువును ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

రియల్ హీరో నాగార్జున అంటూ వ్యాఖ్యానించిన సీఎం.

'తమ్మిడికుంట' అభివృద్ధిలో ఐటీ వాసులకు 'వర్క్ ఫ్రమ్ లేక్' వసతులు.

త్వరలోనే మూసీ ప్రక్షాళన పనులు ప్రారంభం.





తొలి అక్షరం/ హైదరాబాద్, నవంబర్ 11:- హైదరాబాద్ నగర భవిష్యత్తు తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించడంతో పాటు చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మాదాపూర్‌లో 'హైడ్రా' ఆధ్వర్యంలో సమగ్రంగా పునరుద్ధరించిన తమ్మిడికుంట చెరువును శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరెకపూడి గాంధీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రారంభించారు.గతంలో కేవలం 14 ఎకరాలకే పరిమితమైన తమ్మిడికుంట చెరువును ప్రస్తుతం 30 ఎకరాల విస్తీర్ణంలో సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేశారు. ఈ ప్రాజెక్టు కోసం ఉదారంగా ముందుకు వచ్చి, తన పరిధిలోని దాదాపు రెండు ఎకరాల భూమిని ఉచితంగా ప్రభుత్వానికి అందించిన ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జునను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. సమాజ హితం కోసం ముందడుగు వేసిన నాగార్జున నిజ జీవితంలోనూ రియల్ హీరోగా నిలిచారని కొనియాడారు.ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఒకప్పుడు 1,372 చెరువులు ఉండగా, ఆక్రమణల వల్ల సగానికి పైగా కనుమరుగయ్యాయని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నాలాల ఆక్రమణల వల్లే నగరంలో వరదలు వచ్చి ప్రజల ఆస్తులకు నష్టం జరుగుతోందని, చెరువుల పరిరక్షణతో భూగర్భ జలాలు పెరిగి కాలుష్యం తగ్గుతుందని చెప్పారు. అలాగే మూసీ నది ప్రక్షాళన ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, 55 కిలోమీటర్ల మేర ఉన్న మూసీ పరివాహక ప్రాంతంలో తొలిదశ కింద 21 కిలోమీటర్ల అభివృద్ధి పనులకు అవసరమైన ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని భరోసా ఇచ్చారు.తమ్మిడికుంట చెరువును ఆహ్లాదకరమైన పర్యాటక, సామాజిక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచిస్తూ, ఐటీ ఉద్యోగుల కోసం 'వర్క్ ఫ్రమ్ తమ్మిడికుంట' వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే 'ఇందిరా మహిళా శక్తి' సంఘాల మహిళలకు స్టాళ్లు కేటాయించి 'లేక్ ఎకానమీ'ని ప్రోత్సహించాలని, పరిసరాల్లో జమ్మి చెట్లు పెంచి దసరా 'అలాయ్ బలాయ్', సంక్రాంతి పండుగలు జరుపుకునేలా సాంస్కృతిక వేదికగా మార్చాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సినీ నటుడు అక్కినేని నాగార్జున, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ శ్రీజన, హైడ్రా కమిషనర్ రంగనాథ్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ జీఈసీఓగా కె. విజయలక్ష్మి నియామకం

● గాయత్రిపై ఆరోపణలపై విచారణకు ఆదేశాలు..

బయ్యారం పాఠశాలకు బదిలీ





తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో, నవంబర్ 11: మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖలో కీలక మార్పు చోటుచేసుకుంది. జిల్లా నూతన జీఈసీఓగా కె. విజయలక్ష్మిని నియమిస్తూ కలెక్టర్ స్నేహ శబరీష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వహించిన గాయత్రిని జీఈసీఓ పదవి నుంచి తప్పించి, బయ్యారం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించేలా ఆదేశించారు.గాయత్రి పనితీరు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులతో వ్యవహరించిన తీరుపై గతంలో పలు ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. ముఖ్యంగా నేరడ కేజీబీవీ ప్రత్యేక అధికారి సరస్వతిని తొలగించే విషయంలో గాయత్రి అత్యుత్సాహం ప్రదర్శించారనే ఆరోపణలు వినిపించాయి. అంతేకాకుండా, ఆమె భర్త ప్రభాకర్ ప్రత్యేక అధికారులకు రాత్రివేళ ఫోన్లు చేసి డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ అంశాలపై పిసిడబ్ల్యూ న్యూస్ దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ నికోలస్ ఆదేశించారు. విచారణ కొనసాగుతున్న సమయంలోనే గాయత్రిని జీఈసీఓ బాధ్యతల నుంచి తప్పించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆరోపణలు విచారణలో నిర్ధారణ అయితే తదుపరి శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే విచారణ పూర్తయ్యే వరకు ఎలాంటి నిర్ణయానికి రాలేమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.జీఈసీఓగా విజయలక్ష్మి బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో జిల్లా విద్యాశాఖలో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

ఖాతాదారుల నమ్మకమే మా అసలైన బలం



● తొర్రూరు శాఖాధికారి సీనియర్ మేనేజర్ ముడునూరి నవకాంత్ నరేంద్ర వర్మ ● ఘనంగా యూనియన్ బ్యాంక్ ఆవిర్భావ వేడుకలు






తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), నవంబరు 11: బ్యాంకింగ్ రంగంలో శతాబ్దానికి పైగా ఘన చరిత్ర కలిగిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తొర్రూరు శాఖా ప్రాంగణంలో వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు.స్థానిక వ్యాపారవేత్తలు, నగర ప్రముఖులు, ప్రస్తుత సిబ్బంది, విశ్రాంత ఉద్యోగుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ మేనేజర్, శాఖాధికారి ముడునూరి నవకాంత్ నరేంద్ర వర్మ మాట్లాడుతూ.... బ్యాంకు సాధిస్తున్న వరుస విజయాలకు ఖాతాదారులు చూపుతున్న అపరిమితమైన నమ్మకమే ప్రధాన కారణమని పేర్కొన్నారు.1919లో జాతిపిత మహాత్మా గాంధీ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ సంస్థకు శతాబ్దాల ఘన వారసత్వం ఉంది అని అన్నారు.అయితే ఈ రోజు మనం జరుపుకుంటున్న విజయాలు కేవలం చరిత్ర మాత్రమే కాదు బ్యాంకు అభివృద్ధి కోసం రాత్రింబవళ్లు శ్రమించిన విశ్రాంత సిబ్బందికి, అంకితభావంతో పనిచేస్తున్న ప్రస్తుత బృందానికి,మమ్మల్ని నిరంతరం ఆదరిస్తున్న వినియోగదారులకు దక్కిన గౌరవం అని ఆయన ఉద్ఘాటించారు.ప్రాంతీయ అభివృద్ధిలో యూనియన్ బ్యాంక్ పోషిస్తున్న పాత్రను వివరిస్తూ రైతులకు అండగా నిలవడం, స్థానిక సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎం ఈ) సకాలంలో ఆర్థిక చేయూతనందించడం,వేలాది కుటుంబాల భవిష్యత్తుకు భరోసానివ్వడమే తమ ప్రథమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు.రాబోయే రోజుల్లో కూడా మరింత సమర్థవంతమైన, నాణ్యమైన డిజిటల్ ఆర్థిక సేవలతో వినియోగదారుల చెంతకు చేరువవుతామని, తొర్రూరు ప్రాంత సమగ్ర స్వరూపాన్ని మార్చేలా బ్యాంకు సేవలు ఉంటాయని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, విశ్రాంత ఉద్యోగులు, తొలి అక్షరం దినపత్రిక ఎడిటర్ పస్తం సైదులు, ఖాతాదా రులు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు అదేశం

- వచ్చే మంగళవారం స్వయంగా హాజరుపరచాలని డీజీపీకి సూచన



తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 11: శంషాబాద్ భూ వివాదంలో న్యాయస్థానం ఆదేశాల ఉల్లంఘన ఆరోపణలపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్, శంషాబాద్ తహసీల్దార్‌ను వచ్చే మంగళవారం న్యాయస్థానంలో హాజరుపరచాలని డీజీపీ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. భూమి విషయంలో గతంలో ఇచ్చిన న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించి నిర్మాణాలు కూల్చివేసి, స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారని బాధితుడి తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.

ప్రైవేటు స్థలాల్లో ప్రభుత్వ సోలార్ లైట్లు?

● నర్సాప్పగూడాలో వీధులు చీకటిమయం..

అక్రమ తరలింపుపై విచారణకు గ్రామస్తుల డిమాండ్





తొలి అక్షరం/నందిగామ, నవంబర్ 11: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం నందిగామ మండలం నర్సాప్పగూడాలో ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన సోలార్ వీధి దీపాలు కనిపించకుండా పోవడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోటి సుమారు రూ.40 వేల నుంచి రూ.50 వేల విలువైన లైట్లను తొలగించి కొందరు తమ ఇళ్లు, పొలాలు, బావుల వద్ద ఏర్పాటు చేసుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రజా అవసరాల కోసం ఏర్పాటు చేసిన లైట్లు ప్రైవేటు స్థలాలకు ఎలా చేరాయో అధికారులు విచారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన లైట్ల వివరాలను వెల్లడించి, అక్రమంగా తరలించిన వాటిని స్వాధీనం చేసుకొని తిరిగి వీధుల్లో ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

- ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు: జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



తొలి అక్షరం/ములుగు జిల్లా నవంబర్11: మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు.బుధవారం భారత తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ములుగు సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జితో కలిసి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుడిగా, భారత తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి విశిష్ట సేవలు అందించారని కొనియాడా రు. దేశంలో విద్యావ్యవస్థ బలోపేతానికి, విద్యావకాశాల విస్తరణకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరూ విద్య ప్రాముఖ్యతను గుర్తించాలని పేర్కొన్నారు. జాతీయ సమైక్యత, సామరస్యం, సమానత్వం కోసం ఆయన చేసిన కృషిని ఆదర్శ ంగా తీసుకుని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని సూచించారు.జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ అధికారి బి. రామ్మోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. సిద్ధార్థ రెడ్డి, పరిపాలన అధికారి రాజ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శర్వానంద్ 'భోగి' సినిమా విడుదల వాయిదా




యంగ్ హీరో శర్వానంద్ కథానాయకుడిగా, దర్శకుడు సంపత్ నంది కాంబినేషన్‌లో రూపొందుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' విడుదల వాయిదా పడింది. ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బుధవారం సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. అనుకోని కారణాల వల్ల సినిమా విడుదలను వాయిదా వేయాల్సి వచ్చిందని, త్వరలోనే సరికొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని వెల్లడించింది.ఈ మేరకు చిత్రబృందం ఒక ప్రకటన విడుదల చేస్తూ.. "'భోగి' మా అందరికీ ఎంతో ప్రత్యేకమైన ప్రాజెక్ట్. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా, అంకితభావంతో, ప్యాషన్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ప్రేక్షకులకు థియేటర్లలో ఒక గొప్ప అనుభూతిని అందించాలనే సంకల్పంతో మొదటి నుంచీ పనిచేస్తున్నాం. అయితే కొన్ని ఊహించని కారణాల వల్ల సినిమా విడుదలను వాయిదా వేస్తున్నాం. విడుదల విషయంలో సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎలాంటి పుకార్లను, ఊహాగానాలను ఎవరూ నమ్మవద్దు. త్వరలోనే కొత్త విడుదల తేదీని అధికారికంగా ప్రకటిస్తాం" అని స్పష్టం చేసింది.ఈ ప్రణాళిక మార్పు వల్ల కలిగిన అసౌకర్యానికి విచారం వ్యక్తం చేసిన నిర్మాతలు, చిత్రాన్ని మరింత ఉన్నతంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు తమకు ప్రేక్షకుల మద్దతు, సహనం అవసరమని కోరారు. ప్రేక్షకులు ఎదురుచూసే సమయానికి తగిన పూర్తి న్యాయం చేస్తామని మేకర్స్ హామీ ఇచ్చారు. వాస్తవానికి ఈ సినిమాను రేపు (నవంబర్ 12న) ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయాలని గతంలో నిర్ణయించారు.ఈ చిత్రంలో శర్వానంద్ 'గంగ' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన పాత్ర వివరాలు ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. 1960ల కాలం నాటి నేపథ్యంలో, తెలంగాణ మరియు మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఒక ఊహాజనిత గ్రామంలో జరిగే కథాంశంతో ఈ పీరియడ్ యాక్షన్ డ్రామాను దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్నారు.సాంకేతిక విభాగంలో ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, కిశోర్ కుమార్ అరోకియా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కిరణ్ కుమార్ మన్నె ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటున్న 'భోగి' చిత్రాన్ని తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు

ప్రియుడ్ని పెళ్లాడిన 'ఇరుముడి' హీరోయిన్ ప్రియా భవానీ శంకర్



ప్రముఖ నటి ప్రియా భవానీ శంకర్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. తన ప్రియుడు రాజ్ వేల్‌ను ఆమె పెళ్లాడారు. నేడు (నవంబర్ 11న) ఉదయం చెన్నైలో వీరి వివాహం అత్యంత నిరాడంబరంగా, సంప్రదాయబద్ధంగా జరిగింది. సినిమా పరిశ్రమలో సాధారణంగా కనిపించే ఆర్భాటాలు, డెస్టినేషన్ వెడ్డింగ్స్ వంటి వేడుకలకు దూరంగా ఉంటూ, అత్యంత సాదాసీదాగా ఈ శుభకార్యాన్ని నిర్వహించారు.
ఈ పెళ్లి వేడుకలో ప్రియా భవానీ శంకర్ సాంప్రదాయ ఎరుపు రంగు చీరలో మెరిసిపోగా, వరుడు రాజ్ వేల్ తెల్లటి పంచెకట్టులో కనిపించారు. వివాహానికి ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహిత మిత్రులు మాత్రమే హాజరయ్యారు. వేడుకకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఎలాంటి హంగులు లేకుండా ఇంత సింపుల్‌గా వివాహం చేసుకోవడంపై నెటిజన్లు, అభిమానులు నూతన దంపతులను ప్రశంసిస్తూ శుభాకాంక్షలు తెలుపుతున్నారు.
ప్రియా భవానీ శంకర్, రాజ్ వేల్ ఇద్దరూ కాలేజీ రోజుల్లో క్లాస్‌మేట్స్. అప్పటి నుంచే వీరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దాదాపు 10 ఏళ్లుగా వీరి బంధం కొనసాగుతోంది. ఈ విషయాన్ని ప్రియ ఎప్పుడూ దాచలేదు. గతంలో పలు ఇంటర్వ్యూలు, సోషల్ మీడియా పోస్టుల ద్వారా తమ ప్రేమను ధ్రువీకరించారు. వీరిద్దరూ కలిసి ఇప్పటికే ఒక ఇంటిని కూడా కొనుగోలు చేశారు. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో ఇప్పుడు అధికారికంగా ఒక్కటయ్యారు.
న్యూస్ రీడర్‌గా కెరీర్ ప్రారంభించిన ప్రియా భవానీ శంకర్, ఆ తర్వాత బుల్లితెర సీరియళ్ల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 2017లో 'మేయాద మాన్' చిత్రంతో తమిళ వెండితెరకు పరిచయమై, పలు విజయవంతమైన సినిమాల్లో నటించారు. తెలుగులో 'కల్యాణం కమనీయం', 'భీమా', 'జీబ్రా' చిత్రాల్లో నటించిన ఆమె, కమల్ హాసన్ 'భారతీయుడు 2'తో పాటు నాగచైతన్య 'దూత' వెబ్ సిరీస్‌లోనూ మెప్పించారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి' చిత్రం ఘన విజయం సాధించి, తెలుగు ప్రేక్షకుల నుంచి ఆమెకు విశేష ఆదరణ దక్కింది. ప్రస్తుతం 'డిమాంటీ కాలనీ' ప్రాజెక్టులతో పాటు పలు క్రేజీ చిత్రాల్లో ఆమె నటిస్తున్నారు. వివాహ జీవితంలోకి అడుగుపెట్టిన ప్రియా భవానీ శంకర్, రాజ్ వేల్ దంపతులకు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు వెల్లువెత్తిస్తున్నారు.

టాక్సిక్' చిత్రంలో రొమాంటిక్ సీన్స్.. కియారా అద్వానీకి భర్త సిద్ధార్థ్ మద్దతు



రాకింగ్ స్టార్ యశ్ కథానాయకుడిగా తెరకెక్కిన పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్'లో కొన్ని సన్నివేశాలపై బాలీవుడ్ నటి కియారా అద్వానీ సోషల్ మీడియా వేదికగా విమర్శలను ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆమె భర్త, నటుడు సిద్ధార్థ్ మల్హోత్రా ఆమెకు అండగా నిలిచారు.దర్శకురాలు గీతు మోహన్‌దాస్ రూపొందించిన ఈ సినిమాలో కియారా 'నాదియా' అనే సర్కస్ కళాకారిణి పాత్రను పోషించారు. సినిమాలోని కొన్ని సన్నిహిత సన్నివేశాలను ఉద్దేశించి కొందరు నెటిజన్లు ఆమెపై ట్రోలింగ్ చేశారు. వివాహం తర్వాత ఇలాంటి పాత్రలు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పోస్టులు పెట్టారు. ఈ ట్రోలింగ్‌పై సిద్ధార్థ్ మల్హోత్రా సానుకూలంగా స్పందిస్తూ భార్యకు మద్దతు పలికారట. ఈ విషయాన్ని కియారా స్వయంగా వెల్లడించారు. విమర్శలు చేసేవారికి ఇతరుల వ్యక్తిగత జీవితం తెలియదని... విమర్శలను పట్టించుకోవద్దని సిద్ధార్థ్ చెప్పారట. ఇలాంటి వ్యాఖ్యలను పట్టించుకుని మానసిక ప్రశాంతతను కోల్పోవద్దని సూచించారట. మరోవైపు, తోటి నటి హుమా ఖురేషి కూడా ఈ వ్యవహారంపై స్పందిస్తూ, సినీ పరిశ్రమలో మహిళా నటుల పట్ల చూపే ద్వంద్వ ప్రమాణాలు సరికావని ట్రోలింగ్‌ను తీవ్రంగా ఖండించారు. వృత్తిపరమైన నటనను, వ్యక్తిగత జీవితాన్ని వేరుగా చూడాలని పలువురు సినీ విశ్లేషకులు కూడా అభిప్రాయపడుతున్నారు.



సిద్ధూ జొన్నలగడ్డ కొత్త సినిమా ప్రారంభం.. నిర్మాతగా సుకుమార్!



టాలీవుడ్ యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ మరో ఆసక్తికరమైన ప్రాజెక్టుతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. #Siddhu10 అనే వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కనున్న ఈ కొత్త సినిమా బుధవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తొలి షాట్‌కు క్లాప్ కొట్టి సినిమాను లాంఛనంగా ప్రారంభించారు. ఈ నెల చివర్లో రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. తొలుత ఓ పాటను చిత్రీకరించనున్నారు.మోహన్ బి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని స్టార్ డైరెక్టర్ సుకుమార్ నిర్మిస్తున్నాడు. ఆయనతో పాటు ప్రముఖ నిర్మాతలు బన్నీ వాసు, అన్మోల్ శర్మ, అశోక్ బండిరెడ్డి సంయుక్తంగా నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ సినిమాలో సిద్ధూ జొన్నలగడ్డ సరసన నయన్ సారిక కథానాయికగా నటించనుంది. మూడు జాతీయ అవార్డులు అందుకున్న సంగీత దర్శకుడు జి.వి. ప్రకాశ్ కుమార్ బాణీలు సమకూర్చనున్నాడు.సినిమా ప్రారంభోత్సవానికి సంబంధించిన ఫొటోలను సుకుమార్ సోషల్ మీడియాలో పంచుకున్నాడు. దేవుడి ఆశీస్సులతో, ఎంతో ఉత్సాహంగా #Siddhu10 ప్రయాణం మొదలైందని పేర్కొన్నాడు. త్వరలోనే ఓ అందమైన ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని తెలిపాడు. మరోవైపు దర్శకుడు మోహన్ కూడా సినిమా ప్రారంభానికి ముందు భావోద్వేగభరితమైన పోస్టు పెట్టాడు. ఓ కథకుడి కల వెండితెరపై సాకారమయ్యే దిశగా తొలి అడుగు పడిందని, ప్రేమలోని మాధుర్యాన్ని ఆవిష్కరించే అందమైన కలయికగా ఈ సినిమా నిలుస్తుందని పేర్కొన్నాడు. చిత్రంలోని మిగతా నటీనటులు, సాంకేతిక బృందం వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

'ఇట్లు అర్జున' చిత్రానికి సెన్సార్ పూర్తి.. విడుదలకు సిద్ధం



హీరో అనీష్, కథానాయిక అనశ్వర రాజన్ జంటగా నటించిన తాజా రొమాంటిక్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఇట్లు అర్జున'. మహేశ్ ఉప్పాల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ నుంచి క్లియరెన్స్ లభించింది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా 'యూ/ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ 'వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్' సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడించింది.నిజానికి ఈ చిత్రం అక్టోబర్ 30నే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల విడుదల వాయిదా పడింది. ప్రస్తుతం సెన్సార్ సహా అన్ని కార్యక్రమాలు పూర్తి కావడంతో, ఈ చిత్రాన్ని నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు.ఈ సినిమాకు టాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉండటానికి ప్రధాన కారణం దీని నిర్మాణ భాగస్వామ్యం. ప్రముఖ దర్శకుడు వెంకీ కుడుముల 'వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్' బ్యానర్‌పై ఈ చిత్రాన్ని స్వయంగా నిర్మించగా, స్టార్ హీరో అక్కినేని నాగార్జున ఈ సినిమాను సమర్పిస్తున్నారు. ఈ చిత్రంతో అనీష్ హీరోగా వెండితెరకు పరిచయమవుతుండగా, మహేశ్ ఉప్పాల దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు.ఇటీవల విడుదలైన ఈ చిత్ర ట్రైలర్ ప్రేక్షకులలో ఆసక్తిని రేకెత్తించింది. కథ ప్రకారం.. కథానాయకుడు అర్జున్ (అనీష్) మాట్లాడలేని దివ్యాంగుడైనప్పటికీ, చోరీలలో ఎంతో నేర్పరి. నగరంలో జరిగిన ఓ పెద్ద దొంగతనం కేసులో పోలీసులు అతడి కోసం గాలిస్తుంటారు. మరోవైపు, చదువే లోకంగా భావించే క్రమశిక్షణ గల అమ్మాయి కీర్తి (అనశ్వర రాజన్)తో అర్జున్ ప్రేమలో పడతాడు. అర్జున్ మంచివాడనే నమ్మకంతో కీర్తి కూడా అతడిని ఇష్టపడుతుంది. అయితే ఊహించని రీతిలో సుమారు రూ. 1000 కోట్లకు సంబంధించిన ఓ పెన్ డ్రైవ్ వ్యవహారంలో ఒక ప్రమాదకరమైన ముఠా అర్జున్, కీర్తిల వెంటపడుతుంది. అటు పోలీసులు, ఇటు నేర ముఠా ఇద్దరూ వీరిని వెంటాడే క్రమంలో ఏం జరిగింది అనే ఉత్కంఠభరిత కథనంతో సినిమా రూపొందినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది.
ఈ సినిమాకు ఉన్నత స్థాయి సాంకేతిక నిపుణులు పనిచేశారు. సౌత్ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఈ చిత్రానికి స్వరాలు సమకూర్చారు. రాజా మహాదేవ్ సినిమాటోగ్రఫీ అందించగా, రామ్ కుమార్ ఎ ప్రొడక్షన్ డిజైనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కోటి కె ఎడిటింగ్ చేయగా, దిలీప్ సుబ్బరాయన్ యాక్షన్ సన్నివేశాలను కొరియోగ్రఫీ చేశారు. నవంబర్ 13న రానున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో వేచి చూడాలి.

Editor Pastham Saidulu, Tholi Aksharam, PRGI No. TGMUL/25/A1386,Gmail: tholiaksharam@gmail.com , Printing : R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad, Cell No: 8074571329, Telangana State, India.